నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ గురువారం 9 జనవరి 2025 | ADILABAD NIRMAL

బ్యాటింగ్ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆలోచన శక్తిని పెంచుకోవాలి

మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, జనవరి 8 : క్రీడలతోపాటు ఆలోచన శక్తిని పెంపొందించుకున్నప్పుడే అన్ని రంగాల్లో విజయం సాధించడంలో ముందుంటామని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. బుధవారం మాకోడా గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వివేకానంద యూత్ చేపడుతున్న క్రికెట్ క్రీడా పోటీలను మాజీ మంత్రి జోగు రామన్న గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. మొదట క్రీడాకారులకు అభినందనలు తెలియజేసి బ్యాట్, బాల్ చేత పట్టి క్రీడాకారులతో కలిసి స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. పోటీలతో యువత స్నేహభావాన్ని పెంపొందించుకోవచ్చని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ, సర్పంచ్ వెంకన్న, ఎంపీటీసీ రామ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఊశన్న, మాజీ ఎంపీపీ మార్కెట్టి గోవర్ధన్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లింగారెడ్డి, డైరెక్టర్‌లు పురుషోత్తం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణు యాదవ్, బట్టు సతీష్, ఉగ్గే విఠల్, దత్తు, రామన్న పాల్గొన్నారు.

షరతులు లేకుండా భృతి ఇవ్వాలి

కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్మికులు

నిర్మల్ అర్బన్, జనవరి 8 : షరతులు లేకుండా బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధి రాములు అన్నారు. బుధవారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బీడీ కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో అమలుకు నోచుకోని హామీలను ఇస్తూ ప్రజలను పూర్తిగా మోసం చేసిందని అన్నారు. బీడీ కార్మికులకు షరతులు లేకుండా రూ.4,016 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రిమ్స్ మార్చురీలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, క్లీనర్ గజానన్ (ఫైల్)

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం

కళాశాల బస్సుకు విద్యుత్ షాక్

● బస్సు క్లీనర్ మృతి ● విద్యార్థులకు తప్పిన ప్రమాదం ● విద్యుత్ శాఖ సిబ్బంది, ఇంటి యజమానిపై కేసు

ప్రమాదానికి గురైన ప్రైవేటు కళాశాల బస్సు

ఎస్ఈ కార్యాలయం ఎదుట మృతుని బంధువుల ఆందోళన

ఆదిలాబాద్, జనవరి 8(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో బుధవారం ఉదయం ఓ ప్రైవేటు కళాశాల విద్యుత్ వైర్లకు తాకిన ప్రమాదంలో బస్సు క్లీనర్ గజానన్(45) మృతి చెందగా, బస్సులోని విద్యార్థులకు ప్రమాదం తప్పింది. విద్యుత్ వైర్లు బస్సును తాకగా క్లీనర్ కిందికి దిగడంతో ఎర్తింగ్ కారణంగా విద్యుత్ షాక్ తగిలింది. విద్యుత్ శాఖ అధికారులు, ఇంటి యజమాని నిర్లక్ష్యం ఫలితంగా ఈ ప్రమాదం జరిగిందని గజానన్ భార్య సుజాత ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మన్‌తోపాటు, బస్సు డ్రైవర్ గణేశ్‌లపై కేసు నమోదు చేశారు. ఈ ప్రాంతంలో 11 కేవీ విద్యుత్ లైన్ ప్రమాదకరంగా మారిందని వైర్లను పైకి లేపాలంటూ విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత విద్యుత్ లైన్‌ను పరిశీలించడానికి పోయిన విద్యుత్ శాఖ అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం ఎవరిదైనా పేద కుటుంబానికి చెందిన గజానన్ విద్యుత్ షాక్‌తో మరణించడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించగా.. కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కలిచివేశాయి.

ప్రమాదస్థలంలో విద్యుత్ అధికారులను నిలదీస్తున్న స్థానికులు

భద్రతపై చర్యలు అవసరం

జిల్లా కేంద్రంలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు రోజు విద్యార్థులను చేరవేస్తుంటాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సులు పట్టణాల్లోని పలు విధుల్లో వస్తుంటాయి. పలు కాలనీల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ప్రమాదాలు జరగకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. పట్టించుకోవడం లేదని పలు కాలనీల ప్రజలు అంటున్నారు. అనుభవం లేని డ్రైవర్లు వాహనం నడపడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రమాదానికి కారణమవుతున్నాయి. ఇరుకైన సందుల్లో బస్సులు వస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకున్నది. బస్సుల్లో ప్రయాణం చేసే విద్యార్థుల భద్రత విషయంలో కళాశాల యాజమాన్యాలు, అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గజానన్ బంధువులు విద్యుత్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు.

పరామర్శించిన మాజీ మంత్రి జోగు రామన్న

విద్యుత్ షాక్‌తో మరణించిన బస్సు క్లీనర్ గజానన్ మృతదేహాన్ని రిమ్స్‌లో మాజీ మంత్రి జోగు రామన్న పరిశీలించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. కళాశాల యాజమాన్యంతో మాట్లాడి కుటుంబ పరిస్థితిని వివరించారు.

విజనరీ లీడర్‌గా వైస్ ఛాన్స్‌లర్

బాసర, జనవరి 8 : ప్రతిష్టాత్మక బిజినెస్ టాక్ట్ మ్యాగజైన్‌లో బాసర ట్రిపుల్ ఐటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ స్థానం దక్కించుకున్నారు. బిజినెస్ టాక్ట్ మ్యాగజైన్ తన తాజా ఎడిషన్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత నయకత్వాన్ని పునర్నిర్వచించే ప్రముఖ వ్యక్తుల జాబితాను విడుదల చేసింది. ఈ మ్యాగజైన్‌లో ప్రపంచ వ్యాప్తంగా మార్పు, ఆవిష్కరణలకు అభివృద్ధికి సంబంధిత రంగాలలో గణనీయమైన కృషి చేసిన వ్యక్తులను సత్కరిస్తుంది. దీంట్లో భాగంగా ట్రిపుల్ ఐటీ వీసీ గోవర్ధన్ మ్యాగజైన్‌లో స్థానం పొందడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

ట్రిపుల్ ఐటీ వైస్ ఛాన్స్‌లర్ గోవర్ధన్

నత్తనడకన నాగోబా పనులు

మహాపూజకు మిగిలింది 19 రోజులే..

● కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా అలసత్వమే..
● మౌలిక వసతులు కూడా పూర్తికాకపోవడంతో భక్తుల ఆందోళన

గుంతలతో అధ్వనంగా మారిన కెస్లాపూర్ నుంచి దస్నాపూర్ బీటీరోడ్డు

అపరిశుభ్రతతోపాటు నల్లలు లేకుండా ఉన్న నీటి ట్యాంకులు

మరమ్మతులకు నోచుకోలేని బోర్‌వేల్

ఆదివాసుల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతర ఏర్పాట్లు నత్తనడకన సాగుతున్నాయి. మహాజాతరకు ఇంకా 19 రోజులే మిగిలి ఉండడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 2వ తేదీన కలెక్టర్ రాజర్షి షా అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఈనెల 20వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశించి వారం రోజులు గడుస్తున్నప్పటికీ రెండు, మూడు శాఖలు మినహా మిగిలిన శాఖలు పనులు ప్రారంభించలేదు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గోవాడ్‌కు రంగులు వేసే పనులతోపాటు మర్రిచెట్లు, గోవాడ్ ప్రాంతాల్లో భూమి చదును చేసే పనులను ప్రారంభించారు. మిగితా శాఖల అధికారులు ఏర్పాట్ల పనులను ప్రారంభించాలని ఆదివాసులతోపాటు నాగోబా భక్తులు కోరుతున్నారు. *- ఇంద్రవెల్లి, జనవరి 7*

ప్రారంభంకాని పనులు..

- మరుగుదొడ్లు, తాగునీటి పనులు
- మర్రిచెట్ల ప్రాంతంలోని కోనేరు క్లోరినేషన్ పనులు
- ముత్నూర్ నుంచి కేస్లాపూర్ వరకు గల బీటీ రోడ్డు గుంతలు పూడ్చలేదు.
- కేస్లాపూర్ నుంచి దస్నాపూర్ వరకు గల బీటీ రోడ్డు కోతకు గురై అధ్వాన్నంగా ఉంది.
- కేస్లాపూర్ నుంచి హర్కాపూర్ ఎక్స్‌రోడ్డు వరకు కంకర లేని ప్రయాణం చేయలేని విధంగా తయారైంది.
- నాగోబా ఆలయ ఆవరణతోపాటు గోవాడ్, మర్రిచెట్ల ప్రాంతం, దర్బార్ హాల్ ప్రాంతంలోని తాగు నీటి ట్యాంకుల శుభ్రత పనులు, పైపులైన్లకు మరమ్మతులు చేయలేదు.


క్లోరినేషన్‌కు నోచుకోలేని నీటికోనేరు

అపరిశుభ్రత మధ్యలో ఉన్న తాగునీటి నల్లలు


ధ్వంసమైన తాత్కాలిక మరుగుదొడ్లు

అర్జీల స్వీకరణ సంక్రాంతి తర్వాతే

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జనవరి 8 : అర్జీల స్వీకరణ సంక్రాంతి పండుగ తర్వాత ప్రారంభమవుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సీఎం ప్రజావాణి జిల్లా పైలెట్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అర్జీలు స్వీకరించి ఆన్‌లైన్ చేసే డేటా ఆపరేటర్లు ఎంపీడీవోలకు రెండు రోజులపాటు నిర్వహించే ప్రత్యేక శిక్షణ అవగాహనలో కలెక్టర్ పాల్గొని కార్యక్రమం నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మిత్ర అధికారులు ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై వ్యవసాయం, రెవెన్యూ, విద్యుత్, మిషన్ భగీరథ, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి, భూమాత తాగునీటి, పెన్షన్ ఆయా శాఖలకు సంబంధించి అన్ని అంశాలతో కూడిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ వ్యవస్థను రూపొందించి అర్జీదారులు అందించే సమస్యను గురించి ఆన్‌లైన్‌లో ఆ అంశాన్ని ఎంపిక చేసుకుని దరఖాస్తుదారుడికి వెంటనే రసీదు ఇస్తామన్నారు. సంబంధిత అధికారికి పార్వర్డ్ చేసి సమస్య ఏ స్థాయిలో ఉందో తెలిపేలా సెల్‌ఫోన్‌కు మెస్సేజ్ వస్తుందన్నారు. శిక్షణలో ఉదయం, సాయంత్రం సెషన్స్‌లో అవగాహన చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు మద్దతుగా, స్టేట్ నోడల్ అధికారి, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) నుంచి సాంకేతిక సహాయం, సమర్థవంతమైన ఫిర్యాదుల నిర్వహణ కోసం ఆన్‌లైన్ పోర్టల్ అభివృద్ధికి అవసరమైన సహాయాన్ని అందిస్తారని కిసాన్ మిత్ర, సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ, సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవపల్‌మెంట్, దేశ్ పాండే ఫౌండేషన్, సఫర్ వంటి స్థానిక పౌర సమాజ సంస్థల సహకారంతో ఈ ప్రయోగాత్మక ప్రయోగం నిర్వహిస్తారన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఆత్మహత్యకు పాల్పడిన యువతిని కాపాడిన గంగపుత్రులు

బాసర, జనవరి 8 : బాసర గోదావరిలో బుధవారం ఆత్మహత్యకు ప్రయత్నించిన యువతిని గంగపుత్రులు కాపాడారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుందామని ఓ యువతి గోదావరికి వచ్చిం ది. ఆత్మహత్యకు యత్నించగా గమనించిన గంగపుత్రులు ఆమెను కాపాడి పోలీసులకు సమాచారం అందించారు.

కాపాడిన యువతితో గంగ పుత్రులు

దొంగనోట్ల కలకలం

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 8 : నిర్మల్ జిల్లాలో దొంగనోట్లు కలకలం రేపాయి. పట్టణంలోని గాంధీ మార్కెట్ వద్ద బుధవారం కూరగాయలు విక్రయిస్తున్న ఓ వృద్ధుడికి దుండగులు దొంగనోట్లు ఇచ్చి వెళ్లారు. వృద్ధుడి నుంచి బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి నువ్వులు కొనుగోలు చేసి రూ.200 నోట్లు రెండు ఇచ్చి వెళ్లాడు. అక్కడే ఇది గమనించిన మరో వ్యక్తి దొంగనోట్లని గుర్తించి వృద్ధుడికి తెలిపాడు.

మహిళా సాధికారతే ధ్యేయం

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 8 : మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రులు సీతక్క, సురేఖ, ఇందన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్‌తో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. నిర్మల్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు పాల్గొన్నారు. ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ దిశగా మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామన్నారు. పలు అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, డీటీడబ్ల్యూవో అంబాజీ పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలను విడుదల చేయాలి

నల్ల గుడ్డలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

కడెం, జనవరి 8 : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను విడుదల చేయాలని కోరుతూ నల్ల గుడ్డలతో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కడెం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీస్తున్న పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను ఆపడం సరికాదని అన్నారు. నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబాలను పోషించడం ఇబ్బందిగా మారిందని అన్నారు. కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా సునారికారి రాజేశ్, అధ్యక్షుడిగా గొర్రె నరేశ్, ఉపాధ్యక్షులుగా మురుగు లక్ష్మన్, ఆష్రఫ్, ప్రధాన కార్యదర్శిగా శెనిగారపు రాజన్న, సహాయ కార్యదర్శులుగా మాగి గణపతి, దినేశ్, కోశాధికారిగా పెండ్యాల కొమురయ్య, సలహాదారులుగా కస్తూరి రాజేశ్, చిట్యాల రాజన్న, సభ్యులుగా నలిగంటి సాంబయ్య, పంజాల భూమన్నలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, తదితరులు ఉన్నారు.